# స్వేద పత్రంలో మన జిల్లా

## ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పల్లె నుంచి పట్టణం వరకు మారిన రూపురేఖలు

### తొమ్మిదిన్నరేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో గణనీయ అభివృద్ధి

- మిషన్ భగీరథతో దశాబ్దాల ఫ్లోరైడ్ భూతం మాయం
- కాళేశ్వరం జలాలతో బీడు భూములు సస్యశ్యామలం
- మిషన్ కాకతీయ, చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో పెరిగిన భూగర్భ జలాలు
- 13 లక్షల ఎకరాల నుంచి 26 లక్షలకు పెరిగిన సాగు విస్తీర్ణం
- ధాన్యం ఉత్పత్తిలో ఉమ్మడి జిల్లా అగ్రస్థానం
- ఇల వైకుంఠంగా యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణం
- జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు
- దామరచర్లలో 4వేల మెగావాట్ల యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం
- అంతటా పెరిగిన సంపద.. మెరుగుపడిన ఉపాధి అవకాశాలు
- స్వేద పత్రం విడుదల సందర్భంగా జిల్లా ప్రగతిని వివరించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తప్పుడు లెక్కలతో అప్పులు చెప్పిన కాంగ్రెస్.. ఆస్తులు చెప్పలేదని ప్రస్తావన

తెలంగాణ ఏర్పాటుకు ముందు ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలకు అన్నీ సమస్యలే ఉండేవి. తొమ్మిదిన్నరేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగింది. గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల సమస్యలు దూరమై సంపద గణనీయంగా పెరిగింది. కాళేశ్వరం జలాలతో బీడుభూములు సస్యశ్యామలం అయ్యాయి. 2014కు ముందు సాగుభూమి 13 లక్షల ఎకరాలు మాత్రమే ఉండగా.. నేడు ఏకంగా 26 లక్షల ఎకరాలకు చేరింది. దాంతో రైతుల ఇంట సిరులు కురుస్తున్నాయి.

– సూర్యాపేట, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ)

మేడిగడ్డ వద్ద కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి 405.45 కిలోమీటర్ల దూరంలో చివరి ఆయకట్టుగా ఉన్న సూర్యాపేట జిల్లా తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాలకు పుష్కలంగా సాగునీరు అందడంతో నేడు ఆ ప్రాంతాలు సస్యశ్యామలం అయ్యాయి. దాంతో పాటు సూర్యాపేట జిల్లాలోని చిట్టచివరి ప్రాంతమైన పెన్‌పహాడ్ మండలం మాచారం రావి చెరువుకు కూడా కాళేశ్వర జలాలు చేరుతున్నాయి. దాంతోపాటు నాగార్జునసాగర్ నుంచి మనకు రావాల్సిన వాటా నీటిని పక్కాగా వినియోగించుకోవడం ద్వారా ఎడమకాల్వ ఆయకట్టుకు పక్కాగా సాగునీరు అందింది. దానికి తోడు మూసీ ప్రాజెక్టు ఆధునీకరణ, నదులు, వాగుల నీరు వృథాగా పోకుండా కోట్ల రూపాయలతో వాటిపై చెక్ డ్యాంలు సైతం నిర్మించింది. దీనికి తోడు మిషన్ కాకతీయ ద్వారా చెరువులను ఆధునీకరించడంతో అవి ప్రస్తుతం నీటితో కళకళ లాడుతున్నాయి. దాంతో 2014కు ముందు జిల్లాలో 13 లక్షల ఎకరాలుగా ఉన్న ఆయకట్టు నేడు 26 లక్షల ఎకరాలకు చేరింది. గతంలో అన్ని రంగాల్లో వెనుకబడిన ఉమ్మడి నల్లగొండ జిల్లా నేడు అభివృద్ధి పథంలో దూసుకు పోయింది. ఇక 24 గంటల విద్యుత్‌తో జిల్లా వెలుగులు నిండింది. దామరచర్ల వద్ద నిర్మిస్తున్న 4వేల మెగావాట్ల పవర్‌ప్లాంట్ 90 శాతం పూర్తయింది. ఇది పూర్తయితే మన రాష్ట్రం


సూర్యాపేటకు వస్తున్న గోదావరి జలాలు

**కాళేశ్వరంతో పుష్కలంగా సాగునీరు**

మిగులు విద్యుత్ రాష్ట్రంగా అవతరించనుంది. యాదాద్రి ఆలయ పునర్నిర్మాణాన్ని కేసీఆర్ ప్రభుత్వం రూ.1200 కోట్లతో నిర్మించి రేపటి ఇల వైకుంఠంగా మార్చింది. ఆలయానికి ప్రస్తుతం భక్తులు వేల సంఖ్యలో తరలివస్తుండగా.. ఉమ్మడి జిల్లాలో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి. ప్రతి జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు ద్వారా ప్రస్తుతం నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో మెడికల్ కళాశాలలు రావడంతో ఉమ్మడి జిల్లాకు చెందిన పేద విద్యార్థులకు సైతం వైద్యవిద్య చేరువైంది. జిల్లా కేంద్రాల్లోని వైద్య శాలలను బోధనాస్పత్రులుగా మార్చి ఆధునిక పరికరాలు, భవనాలు సమకూర్చడంతో ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం మన వద్ద అందుతున్నది. గతంలో రాష్ట్రంలోనే పూర్తిగా వెనుకబాటుకు గురైన ఉమ్మడి నల్లగొండ జిల్లా తొమ్మిదిన్నరేండ్ల కాలంలో అభివృద్ధి పథంలో పయనించి వందల కోట్ల సంపదను కలిగి ఉంది. అయితే ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో శ్వేతపత్రాల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు లెక్కలతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిందని చెప్పిందే తప్ప ఆస్తులు ఏమేర పెరిగాయో చెప్పకుండా ప్రజలను తప్పుదోవ పట్టించింది.

## ఫ్లోరిన్ రక్కసికి విరుగుడు



బట్లపల్లిలో నిర్మించిన నీటిశుద్ధి కేంద్రం

ఉమ్మడి పాలనలో నల్లగొండ జిల్లా పేరు ప్రపంచంలోనే రికార్డుల్లోకి ఎక్కింది. అదేదో గొప్ప పని చేసినందుకు కాదు తాగునీటిలో ఫ్లోరిన్ కారణంగా ఫ్లోరోసిస్‌తో కాళ్లు, చేతులు, నడుము వంకర్లు తిరిగి నల్లగొండ జిల్లాలో రెండు లక్షలకు పైగా ప్రజలు జీవచ్ఛవాలుగా బతికే పరిస్థితి ఉన్నందుకు. జలసాధన సమితి అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ ఫ్లోరోసిస్ బాధితులతో ఆనాటి ప్రధాని వాజ్‌పేయి వద్దకు వెళ్లి ఫ్లోరైడ్ బాధితుడు అంశుల స్వామిని ఏకంగా ప్రధాని ఎదుట టేబుల్‌పై పడుకోబెట్టి ఈ ప్రాంత దీనస్థితిని వివరించారు. 2014కు ముందు జిల్లాలో 967 ఫ్లోరైడ్ ఆవాస ప్రాంతాలు ఉండేవి. తెలంగాణ ఏర్పాటైన అనంతరం కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ శుద్ధి చేసిన తాగునీటిని అందించి ఫ్లోరైడ్ బాధను తీర్చింది. తొమ్మిదిన్నరేండ్ల కృషి అనంతరం నేడు రాష్ట్రంలో ఫ్లోరైడ్ పీడిత ప్రాంతం ఒక్కటి కూడా లేదని ఏకంగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకటించింది.

## రూ.1200 కోట్లతో యాదాద్రి పునర్నిర్మాణం


యాదగిరిగుట్ట ప్రధానాలయం

యాదగిరిగుట్ట, డిసెంబర్ 24 : ఆ రోజుల్లో యాదగిరిగుట్ట ఆలయ ప్రాంగణమంతా దట్టమైన అడవే. గుహలోని స్వయంభువులను దర్శించుకునేందుకు భక్తులు ఎండ్లబండ్లు, కాలినడకన వచ్చేవారు. కాల క్రమేణ రద్దీ పెరిగి గుట్ట మీదికి మార్గం ఏర్పడింది.. కానీ అభివృద్ధి మాత్రం జరుగలేదు. సరైన వసతులు లేక భక్తులు ఇబ్బందులు పడేవారు. రాష్ట్రం ఏర్పాటు అనంతరం 2014 అక్టోబర్ 17న యాదగిరిగుట్ట ఆలయాన్ని విశ్వఖ్యాతి చెందేలా అభివృద్ధి చేస్తానని అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. 2015 మార్చి 5న యాదగిరిగుట్టకు యాదాద్రి అని నామకరణం చేసి ఆలయ పునర్నిర్మాణానికి ప్రత్యేకంగా యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ(వైటీడీఏ)ని కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అథారిటీ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధికి మొత్తం 1391.09 ఎకరాల భూమిని సేకరించారు. ఆర్కిటెక్ట్ ఆనందసాయి, ప్రధాన స్తపతి సుందరరాజన్‌తో వాస్తు సిద్ధంతం, శాస్త్రపరంగా ప్లాన్ వేసి గర్భాలయం, ముఖమండపం, మహా మండపాలు పూర్తిగా కృష్ణ శిలలతో నిర్మించారు. నల్లరాతితో, రాతిశిల్పాలతో నిర్మించిన గోపురాలు ప్రపంచంలోనే ఎక్కడాలేవు. ఒక్కో కట్టడానికి పక్కాగా కొలతలు వేసి అందంగా, భక్తులకు అనువుగా నిర్మించారు. యాదగిరి కొండపైన 17.32 ఎకరాల్లో ప్రధానాలయం నిర్మించారు. ఇందులో 4.30 ఎకరాల్లో ప్రధానాలయం, బ్రహ్మోత్సవ మండపం, మాఢవీధులు, ప్రాకారాలు, సప్తతల, పంచతల రాజగోపురాలు, వేంచేపు మండపం, రథశాల, లిఫ్టు నిర్మించారు. 2.5 లక్షల టన్నుల కృష్ణశిలతో దాదాపు వెయ్యేండ్ల వరకు చెక్కు చెదరకుండా ఆలయ నిర్మాణాలు పూర్తి చేసి 2022 మార్చి 28న పునఃప్రారంభించి స్వయంభూ పంచనారసింహస్వామి దర్శన భాగ్యం భక్తులకు కల్పిస్తున్నారు. రూ.1200 కోట్ల ఖర్చుతో ఆలయాన్ని పునర్నిర్మించారు. నిత్యం సగటున 20 నుంచి 30 వేల మంది, శని, ఆదివారాల్లో 50 వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు.

## బీఆర్‌ఎస్ స్వేద పత్రాన్ని ఆసక్తిగా తిలకించిన ప్రజలు

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం తెలంగాణ భవన్‌లో విడుదల చేసిన స్వేదపత్రం, అందులో ఉన్న అంశాలను ప్రజలు టీవీల్లో ఆసక్తిగా తిలకించారు. తొమ్మిన్నరేండ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సమకూర్చిన ఆస్తులపై చర్చించుకోవడం కనిపించింది.


సూర్యాపేటలోని సెలూన్‌లో టీవీ చూస్తున్న స్థానికులు


ఆత్మకూరు(ఎం) : బీఆర్‌ఎస్ స్వేదపత్రాన్ని టీవీలో తిలకిస్తున్న ప్రజలు


నల్లగొండ : టీవీలో కేటీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న స్థానికులు

## అభివృద్ధికి నిదర్శనమే ఆలయ పునర్నిర్మాణం



2014కు ముందు నేను ఆలయ ధర్మకర్తగా ఉన్నప్పుడు ఎంతో మంది మంత్రులు, ముఖ్యమంత్రులు వచ్చి స్వామి వారిని దర్శించుకొని వెళ్లారే తప్ప యాదగిరిగుట్ట క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచన రాలేదు. రాష్ట్రం ఏర్పాటు అనంతరం సీఎంగా కేసీఆర్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం గుట్టను పునర్నిర్మిస్తామని ప్రకటించారు. ఆయన ఇచ్చిన మాట ప్రకారం 2015లో ఆలయ పునర్నిర్మాణం ప్రారంభించి, 2023లో పూర్తి చేశారు. భక్తులకు సకల వసతులతో గుట్ట అభివృద్ధి జరిగింది. గతంతో పోలిస్తే భక్తుల సంఖ్య సైతం విపరీతంగా పెరిగింది. కేసీఆర్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో జరిగిన అభివృద్ధికి నిదర్శంగా యాదగిరిగుట్ట క్షేత్రం నిలుస్తున్నది.

–పెలిమెల్లి శ్రీధర్‌గౌడ్, ఆలయ మాజీ ధర్మకర్త, యాదగిరిగుట్ట దేవస్థానం

## గుర్తుపట్టలేనంతగా మారిన యాదగిరిగుట్ట



2014 కంటే ముందు.. ఇప్పుడున్న యాదగిరిగుట్ట ఆలయాన్ని పోల్చుకోలేం. ఒక్కప్పుడు కొండపైకి వెళ్లాలంటే సరైన రోడ్డు కూడా ఉండేది కాదు. కానీ కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి చేసి యాదగిరిగుట్ట దేవస్థానాన్ని ప్రపంచపటంలో నిలిపారు. గుట్ట అభివృద్ధితో చుట్టూ 20 కిలోమీటర్ల మేర భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. రైతులు కోటీశ్వరులయ్యారు. అభివృద్ధి జరుగలేదనే వారిని తీసుకొచ్చి యాదగిరిగుట్టను చూపిస్తే తెలుస్తుంది.

–వంటేరు సువర్ణ, సర్పంచ్, మాసాయిపేట, యాదగిరిగుట్ట మండలం.